# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- మండల వ్యాప్తంగా 22 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటివరకు 66 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు


నందగిరి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

**పెగడపల్లి:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన కొనసాగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులైనా. కేవలం 66 వేల క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. మండల వ్యాప్తంగా 26 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, 4 లక్షల క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. మండలంలో రైతులు ఇంత మొత్తంలో పండించిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు పూర్తి కావాలంటే ఇంకా కనీసం నెల సమయం పట్టే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు కేంద్రాలకు ధాన్యం తరలించి మాయిశ్చర్ కోసం రోజుల తరబడి ధాన్యం ఆరబోసి తూకం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. రైతులు నిర్వాహకులను ప్రశ్నిస్తే మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని, ఒక్కో కేంద్రం నుంచి ఒక్కో లారీ ధాన్యం పంపించాలని చెబుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతుండటం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షం పడితే నష్ట పోతామని రైతులు భయపడుతున్నారు. దీంతో మండలంలోని చాలా మంది రైతులు ధాన్యం విక్రయించేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు రూ. 2050 చెల్లిస్తున్నారని దీంతో ఎక్కువ మంది రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 66 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరించినట్లు అధికారులు తెలిపారు. అయితే తూకం చేసిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే మిల్లర్లకు చేరవేస్తున్న అక్కడ ధాన్యం బస్తాలను దింపు కోవడంలో జాప్యం జరుగుతుందని, దీంతో తూకంలో కొంత ఆలస్యం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

## కొనుగోళ్లలో వేగం పెంచాలి



20 రోజుల కింద వడ్లు తెచ్చి కుప్పబోసిన. తూర్పార పడుదామంటే మిషన్ దొరుకత లేదు. పొద్దంత ఎండల ఉంటున్నా. మ్యాయిచర్ వచ్చి శుద్ధి చేసిన వడ్లను కాంటా పెట్టడంలో ఆలస్యం అవుతోంది. ఇదేందని సార్లను అడిగితే మిల్లర్లు సంచులు దించుకుంటలేరని అంటుండ్రు. ఎప్పుడు వర్షం వస్తుందోనని భయపడాల్సి వస్తోంది. వడ్లను జోకడంలో వేగం పెంచి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

– కంబాల్ల మల్లేశం, మద్దులపల్లి

## పదిహేను రోజులవుతోంది..



నేను ధాన్యం తెచ్చి పది రోజులవుతోంది. ఎండబోసి తూర్పారబట్టిన. కాంటా వేయడంలో ఆలస్యం అవుతోంది. వరుస ప్రకారం కాంటా పెడుతున్నా రోజుకు ఒకటి రెండు లారీలు మాత్రమే జోకుతున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ధాన్యం తూకంలో వేగం పెంచాలి.

– సంకిటి మునీందర్‌రెడ్డి, నందగిరి

# యంత్రపు కోత.. పశుగ్రాసానికి గోస


హార్వెస్టర్‌తో వరి కొయిస్తున్న రైతులు

**బుగ్గారం:** వ్యవసాయానికి అనుబంధంగా ప్రతి రైతు కుటుంబంలో పశువులు కూడా భాగమై ఉంటాయి. వ్యవసాయం నుంచి వచ్చే అనేక ఉత్పత్తులు వాటికి మేతకు ఉపయోగపడడంతో రైతులు వాటి కోసం ప్రత్యేకంగా గ్రాసం కొనుగోలు చేయడం అవసరం ఉండదు. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడానికి అవకాశం కలుగుతుంది. మొక్కజొన్న, వేరుశనగ వంటి ఇతర పంట ఉత్పత్తులను కూడా పశువులకు మేతగా ఉపయోగిస్తున్నా వాటి సాగు విస్తీర్ణం వరితో పోల్చితే తక్కువగా ఉంటుంది. దీంతో పశువులకు గ్రాసంగా వరిగడ్డినే ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. యంత్రాల వినియోగం లేనప్పుడు కూలీల సహాయంతో వరిని కోసి ఆరబెట్టి,పశువులతో తొక్కించి ధాన్యం నూర్పిడి చేసేవాళ్లు. దీని వలన ఎకరాకు వరిపొలం నుంచి ఒక పూర్తిస్థాయి ట్రాక్టర్ లోడ్ వరి గడ్డి సమకూరేది.అలాగే వరిగింజలు కూడా వృథా అయ్యేవి కావు.

**విరివిరిగా యంత్రాల వినియోగం**

ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో కూలీల ఖర్చులు,సమయం ఆదా చేసుకోవడానికి రైతులు వరికోత యంత్రాలతో పంటను కోస్తున్నారు. ఈ విధానంలో కూలీల ఖర్చులు,ఇతర వాతావరణ ఇబ్బందులు తప్పినా పశుగ్రాసం దిగుబడిపై అధిక ప్రభావం పడుతుంది. దిగుబడి సగానికి తగ్గుతుంది.కొంతమంది పశువులు లేని రైతులైతే తమ పొలాల్లోనే వరిగడ్డిని తగులబెట్టేస్తున్నారు.దీంతో వరిగడ్డి పశువుల అవసరం మేరకు సరిపోవడం లేదు.పశువులు అధికంగా ఉన్న రైతులు ఇతర ప్రాంతాల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 నుంచి 6 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పశుపోషణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా మంది రైతులు వరి గడ్డి లేక తమ పశువులు అమ్ముకుంటున్నారు. మేయడానికి స్థలం లేక రైతులు పశువులను పెంచుకోవడం లేదు. వెటర్నరీ అధికారుల సమాచారం ప్రకారం ఉమ్మడి ధర్మపురి మండలంలో సుమారు 9800 ఆవులు,8640 గేదెలు, 40 వేల వరకు గొర్రెలు,మేకలు ఉన్నాయి.అయితే ఇవి 2013 వ సంవత్సరంలో చేసిన పశుగణన వివరాలు. ఇప్పుడు సర్వే నిర్వహిస్తే పశువుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

## క్లుప్తంగా

### దారి బాగు చేయించారు..



సాక్షి స్పందన

**మేడిపల్లి:** భీమారం నుంచి వెంకట్రావుపేటకు వెళ్లే దారిలో చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్న వైనంపై 'వాళ్ల నాటుడు.. వీళ్ల నరుకుడు' పేరుతో సాక్షిలో కథనం ప్రచురితం కాగా, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి రోడ్డుకు ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉద్యోగులు, పెన్షనర్ల హక్కులకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

**జగిత్యాలటౌన్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, పెన్షనర్ల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చర్చావేదికలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, టీపీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాశ్ రావు, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు అశోక్ రావు, కొయ్యడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ముడుపులు కట్టిన బీఆర్ఎస్ నాయకులు


ముడుపు కడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**బుగ్గారం:** పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలవాలని బుగ్గారం మండల బీఆర్ఎస్ నాయకులు స్థానిక ముత్యాల పోచమ్మ–నల్లపోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కట్టారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం కృషి చేసిన ఈశ్వర్‌నే గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్, మాజీ సర్పంచులు మూల శ్రీనివాస్‌గౌడ్, చీర్నేని మల్లేశం, దోరగండ్ల జగన్, నాయకులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని రక్షించడమే బీఎస్పీ లక్ష్యం


వర్షకొండలో ప్రచారం చేస్తున్న లింబాద్రి

**ఇబ్రహీంపట్నం:** భారత రాజ్యాంగాన్ని రక్షించడమే బీఎస్పీ లక్ష్యమని బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి లింబాద్రి అన్నారు. మండలంలోని వర్షకొండ, కోమటి కొండాపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, మారుస్తామని ప్రకటనలు చేస్తే ప్రధాని తమ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ధరలను పెంచి సామాన్యులపై అధిక భారం మోపిందన్నారు. ఏనుగు గుర్తుకు ఓటేయ్యాలన్నారు.కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గుజ్జెరి ప్రకాశ్, తండ్రి గంగాధర్, బొబ్బిలి కిశోర్, బోయిని వెంకటేశ్, ప్రశాంత్, నరేశ్, అజయ్ పాల్గొన్నారు.

### క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 30 మంది విద్యార్థుల ఎంపిక

**కోరుట్ల:** పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 30 మంది ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ తెలిపారు. ఇప్పటివరకు 12 సార్లు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించి సుమారు 400–450 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లో ఫైనల్ ఇంటర్వ్యూ ఉంటుందని హెచ్ఆర్ వినయ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# ఎంపీ అర్వింద్ అబద్ధాల కోరు


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

**మల్లాపూర్:** బీజేపీ ఎంపీ అర్వింద్ అబద్ధాల కోరు అని, కవితకు పట్టిన గతే అర్వింద్‌కి పడుతుందని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ మండల స్థాయి బూత్ లెవల్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఎంపీ అరవింద్ సొంతపార్టీ నాయకులనే మోసం చేశాడని, అరవింద్‌కి అహంకారం ఎక్కువైందని బీజేపీ నాయకులే ప్రచారం చేసే దుస్థితి తెచ్చుకున్నాడన్నారు.ప్రజానాయకుడు జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి, రాష్ట్ర నాయకుడు జెఎన్ వెంకట్, ఆకుల లింగారెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్ల సత్తెమ్మమల్లయ్య, కాంగ్రెస్ మాజీమండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బాడీ ఫ్రీజర్ వితరణ


ఫ్రీజర్ అందిస్తున్న దాత పోశన్న

**ధర్మపురి:** మండలంలోని జైనా గ్రామానికి చెందిన చెన్నంగుల పోశన్న తన తల్లి జ్ఞాపకార్థం ఆదివారం బాడీ ఫ్రీజర్ అందజేశారు. జైనా తోపాటు పరిసర గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే మృత దేహాన్ని భద్రపరచడానికి బాడీ ఫ్రీజర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచులు కుడిక్యాల మహేశ్, ఎన్నం లక్ష్మారెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా అశోక్

**మెట్‌పల్లి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా బందిల అశోక్‌ను నియమించినట్లు జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్ ఆదివారం తెలిపారు. జిల్లాలో సంఘం బలోపేతానికి ప్రతీ మండలంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**చేనేత పద్మ సమైఖ్య అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్**

**జగిత్యాలరూరల్(రాయికల్):** రాయికల్ మండల చేనేత పద్మ సమైఖ్య అధ్యక్షుడిగా కడకుంట్ల ప్రవీణ్‌కుమార్ నేతను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపల్లి బాల్‌రాజు నేత ఉత్తర్వులు జారీ చేశారు.


### కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

**మేడిపల్లి:** గల్ఫ్ కార్మిక కుటుంబాలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి కోరారు. మేడిపల్లిలో ఆదివారం మాట్లాడారు. గల్ఫ్ కార్మికులను మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఓటమితప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేపూరి నాగరాజు, హరీశ్, మాదం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం**

**సారంగాపూర్:** ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. జీవన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, ప్రసాద్, తిరుపతిరెడ్డి, మహేశ్, రాజం, నర్సింహారెడ్డి, సరళ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి


ప్రచారం చేస్తున్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు

**జగిత్యాలరూరల్:** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు అన్నారు. జగిత్యాల మండలం కన్నాపూర్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌కు మద్దతుగా ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుంచడంతో పాటు నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, నాయకులు పెద్ద గంగారాం, భరత్, రమేష్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

### సన్‌రైజ్ తైక్వాండో చైర్మన్‌గా మంచాల కృష్ణ


తైక్వాండో నూతన కార్యవర్గం

**జగిత్యాలటౌన్:** సన్‌రైజ్ తైక్వాండో జిల్లా చైర్మన్‌గా మంచాల కృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఆదివారం తైక్వాండో సర్వసభ్య సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కోల గంగారావు, జనరల్ సెక్రెటరీగా గందె సంతోష్, కోశాధికారిగా గందె శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ భీమేశ్వర్, రమేశ్,యాసిన్, జిల్లా మహేందర్, సలాఉద్దీన్, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, ఎండీ సోహెబ్ సిద్ధిక్, ఎస్ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి పలికొండ గంగాధర్ తెలిపారు. నూతన కార్యవర్గం 2028 వరకు అధికారంలో ఉంటుందన్నారు.

### బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం


మల్యాలలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**మల్యాల:** బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు ఆదివారం మల్యాలలో ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తూ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు చక్రంగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గాజులు మల్లేశం, నక్క ఆనందం, ముత్యాల మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### దాతల సాయం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న లచ్చయ్య

**జగిత్యాలరూరల్:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తొందుర్తి లచ్చయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం కోసం రూ 1.70 లక్షలు అవసరం కాగా, దాతలు నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఫోన్ నంబర్ 8978554341, 9989081838 ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

### జగ్గాసాగర్‌లో పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో గౌడ కులస్తులు ఆదివారం పోచమ్మ బోనాలు చేశారు.డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గీత కార్మికులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

### సుద్దపల్లిలో ఎల్లమ్మ బోనాలు

**పెగడపల్లి:** మండలంలోని సుద్దపల్లిలో ఎల్లమ్మ పట్నాలు ఘనంగా జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గౌడ కులస్తులు బోనాలు చేశారు. డప్పు చప్పుళ్లతో ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెరేళ్ల హారిక గౌడ్, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా చల ప్రతిష్ఠ

**కోరుట్ల:** పట్టణంలోని సాయిరాంపుర కాలనీలోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో సీతా రామచంద్ర స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాల చల ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం, ప్రతేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దురిశెట్టి సత్యనారాయణ, ప్రశాంత్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**వెల్గటూర్ :** మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్‌లో 2006–07 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 17 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు, ఉపాధ్యాయులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులతో కలిసి ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

**శిశుమందిర్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు**

**జగిత్యాలటౌన్:** పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో 1998–99 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని వశిష్ట ఇన్ హోటల్లో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

**పాఠశాలలో స్కూల్ డే వేడుకలు**

**కథలాపూర్:** మండలంలోని తాండ్ర్యాల విజయ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం స్కూల్ డే వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రఘుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ధాన్యం తరలింపునకు లారీలు పంపించండి

**సారంగాపూర్:** ధాన్యం తరలింపునకు లారీలను పంపించాలని సారంగాపూర్ రైతులు ఆదివారం తహసీల్దార్ రమేశ్ ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని నాయికపుగూడెం కేంద్రానికి లారీలు రాకపోవడంతో ప్రతి బస్తాలో తరుగు వస్తుందని పేర్కొన్నారు. వెంటనే లారీలు పంపించాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన లారీలను వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. దీనిపై సహకార సంఘం సీఈవో ఇస్మాయిల్ వివరణ ఇస్తూ ఆదివారం రెండు లారీలు వచ్చాయని, లారీల జాప్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**వాహనాలు పట్టివేత**

**కథలాపూర్:** మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు వాహనాలు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కథలాపూర్ నుంచి కోరుట్ల వైపు ఇసుకతో వెళ్తున్న ఒక లారీ, ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.